పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న గిరిజనులు

హత్యా..? ఆత్మహత్యా..?

- ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం
- కుటుంబ సభ్యులు వచ్చేసరికి దూలానికి యువతి మృతదేహం
- వీర్నపల్లి మండలం బాబాయిచెరువుతండాలో ఘటన
- ప్రేమించిన యువకుడే చంపాడంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- అతడి ఇంటిని ధ్వంసం చేసిన మృతురాలి బంధువులు

మమత (ఫైల్)

వీర్నపల్లి, మే 30 : ప్రేమ వ్యవహారంలో ఓ గిరిజన యువతి ప్రాణం పోయింది. జరిగింది హత్యా? లేక ఆత్మహత్యా? అనేది తేలాల్సి ఉన్నది. వీర్నపల్లి మండలంలో జరిగిన ఈ ఘటన ఎన్నో అనుమానాలకు తావిస్తున్నది. యువతి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. బాబాయిచెరువుతండాకు చెందిన బానోత్ రాందాస్, అంజవ్వకు నలుగురు కూతుళ్లు లలిత, సుష్మ, చిట్టి, మమత(21), కొడుకు గణేశ్ ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు వివాహాలు జరుగగా, నాలుగో కూతురైన మమత వేములవాడలోని ఓ దవాఖానలో నర్సుగా పనిచేస్తున్నది. గురువారం ఉదయం యువతి కుటుంబ సభ్యులు పండుగ కోసం బావుసింగ్‌నాయక్‌తండాకు వెళ్లగా, మమత ఇంట్లో ఒంటరిగా ఉన్నది. కుటుంబ సభ్యులు మధ్యాహ్నం తర్వాత ఇంటికి వచ్చి చూసే సరికి ఆమె మృతదేహం దూలానికి వేలాడుతూ కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మమత చేతికి గాయాలు ఉండడంతో ఆమెను ప్రేమించిన బావుసింగ్‌నాయక్ తండాకు చెందిన యువకుడు గుగులోత్ సతీశ్ హత్య చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. అతని ఇంటికి చేరుకొని సామగ్రిని ధ్వంసం చేశారు. ఇంట్లో పెట్రోల్ చల్లి నిప్పంటించగా దుస్తులతోపాటు సామగ్రి పాక్షికంగా కాలిపోయింది.

బంధువుల ధర్నా

ప్రేమ వ్యవహారంలో మమతను గుగులోత్ సతీశ్ చంపి ఉరి వేసుకున్నట్టు చిత్రీకరించాడని మమత కుటుంబ సభ్యులు ఆరోపించారు. నిందితుడిని శిక్షించి తమకు న్యాయం చేయాలని మమత తల్లి, సోదరుడు పోలీసులను దీనంగా వేడుకున్నారు. ఈ మేరకు బాబాయిచెరువుతండా వాసులతో కలిసి పెద్ద సంఖ్యలో బావుసింగ్‌నాయక్ తండాలోని సతీశ్ ఇంటికి చేరుకున్నారు. యువకుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ మూడు గంటల సేపు ధర్నా చేశారు. ఒకనొక దశలో పోలీసులకు గిరిజనులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐలు రమాకాంత్, రమేశ్, శేఖర్‌రెడ్డి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడగా శాంతించారు. అక్కడి నుంచి బాబాయిచెరువుతండాలోని మృతురాలి ఇంటికి చేరుకొని మమత మృతికి కారణమైన యువకుడిని తమకు చూపించేవరకు మృతదేహాన్ని తీయనీయమంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

'పచ్చిరొట్ట' విత్తనాలు ఎక్కడ..?

- కేంద్రాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్న అధికారులు
- అన్నదాతకు తప్పని తిప్పలు

పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు ఆగమవుతున్నారు. అధికారుల నిర్వాకంతో కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే పంపిణీ చేసిన అధికారులు.. రెండో రోజు పత్తా లేకుండా పోవడంతో తీవ్ర నిరాశ చెందారు. పైగా ఫోన్లు చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో ఎవరిని అడుగాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. గురువారం విక్రయ కేంద్రాలకు వెళ్లి అడిగినా ఫలితం లేక వట్టి చేతులతో వెనుదిరిగారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు వస్తుండడంతో స్టోర్‌ను మూసేస్తున్న డీసీఎంఎస్ సిబ్బంది

కరీంనగర్, మే 30 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ మండల రైతులకు బుధవారం తీగలగుట్టపల్లిలోని డీసీఎంఎస్ పంపిణీ కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కేంద్రానికి అలాట్ చేసిన 40 క్వింటాళ్ల విత్తనాలు రెండు మూడు గంటల్లోనే ఖాళీ కావడంతో బారులు తీరిన రైతులంతా తీవ్ర నిరాశ చెందారు. అధికారులను ప్రశ్నించగా.. అవసరమైన విత్తనాలను గురువారం పంపిణీ చేస్తామని, నేరుగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ రోడ్‌లోని డీసీఎంఎస్ కేంద్రానికి వెళ్లాలని అధికారులు నమ్మబలికారు. కొందరు రైతులకు పర్మిట్లు కూడా ఇచ్చారు. అధికారులు చెప్పిన ప్రకారం రైతులు గురువారం డీసీఎంఎస్ కార్యాలయంలోని స్టోర్స్‌కు వెళ్లారు. తీరా అక్కడ పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టోర్స్ సిబ్బందిని ప్రశ్నించగా విత్తనాలు రాలేదని, తాము ఏం చేయాలని రైతులను ఎదురు ప్రశ్నించారు. అంతే కాకుండా రైతులు ఎక్కువ మంది గుమిగూడక ముందే డీసీఎంఎస్ సిబ్బంది స్టోర్స్ మూసుకున్నారు. పరిస్థితిని గమనించి సంబంధిత అధికారులకు ఫోన్లు చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో నిరాశగా వెనుదిరిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విత్తనాలు ప్రతి సీజన్‌లో అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం ఈ సారి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విత్తనాలు అందుబాటులో లేనపుడు పర్మిట్లు ఎందుకు ఇచ్చారని నిలదీస్తున్నారు.

అందుబాటులో ఉంచుతున్నాం : డీఏవో

రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని కరీంనగర్ డీఏవో బత్తిని శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాకు అవసరమైన 4,500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలకుగాను ఇప్పటి వరకు 2,200 క్వింటాళ్లు పాజిషన్ చేశామని చెప్పారు. ఎల్లుండి వరకు మిగతా విత్తనాలు అందుబాటులోకి తెస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. జిల్లాకు 1.10 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం ఉంటాయని, అందులో అవసరానికి మించి 1.20 లక్షల విత్తనాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. పత్తి సాగు చేసే రైతులు ఒకే రకమైన విత్తనాలను అడగరాదని, ఏ కంపెనీకి చెందినవైనా ఒకే విధమైన దిగుబడిని ఇస్తాయని స్పష్టం చేశారు. వరి, మక్క, కంది, పెసర, తదితర అన్ని రకాల విత్తనాలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నరు

నాకు 30 కిలోల జీలుగ విత్తనాలు అవసరం ఉన్నయి. నిన్న తీగలగుట్టపల్లిల లైన్ల నిలబడ్డ. విత్తనాలు దొరకలె. లైన్ల ఉన్న చాలా మంది వట్టి చేతులతో పోయిన్రు. అయితే ఈ రోజు ఇస్తమని చెప్పిన్రు. డీసీఎంఎస్‌కు రమ్మని అన్నరు. తీరా ఇక్కడికి వస్తే విత్తనాలు ఇంకా రాలేదు. మమ్మల్ని ఏం చెయ్యమంటరని సిబ్బంది అంటున్నరు? ఇదేం పరిస్థితని మా ఏఈఓకు ఫోన్ చేస్తే ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మా బాధ ఎవలకు చెప్పుకోవల్నో అర్థంకాక ఇంటికి పోతున్నం.

- జాలపల్లి విష్ణు, చామన్‌పల్లి

ఇత్తనాలు లేకుంటే ఎందుకు రాసిచ్చిన్రు

మొన్నటి సంది గోసవుచ్చుకుంటన్రు. జీలుగ ఇత్తనాలు కావాల్నంటే రాసిచ్చిన్రు. కానీ, ఎక్కడా దొరుకుత లేవు. నిన్న తీగలగుట్టపల్లిల ఇదే లొల్లి. అక్కడ ఖతమైనయని ఇయ్యల డీసీఎంఎస్‌ల ఇస్తమంటే ఈడికచ్చినం. ఇక్కడ సుతం లెవ్వు. మరేడికిపోవుడు? ఇత్తనాలు లేనపుడు తెచ్చుకోండని రాసిచ్చుడు దేనికి? మమ్ముల పరేషాన్ చేసుడు దేనికి? ఎప్పుడస్తయో చెప్తే గప్పుడే వచ్చి తీస్కపోతంగదా..

- మోత్కు రాజయ్య, నగునూర్

గింతగనం గోసవుచ్చుకుంటున్రు

గీ జీలుగ ఇత్తనాల కోసమే గింతగనం గోసవుచ్చుకుంటున్రు. ముమ్ముందు వరి, మక్క, పత్తి ఇత్తనాల కోసం ఎంత బాధపడుఉ అయితదో ఏమో..? వరి పెట్టి రైతులు ఎక్కువ మంది జీలుగ అలుకుతరు. పంట మంచిగస్తదని ఆశ పడ్తరు. అక్కడిస్తంద్రంటే అక్కడికి పోవడ్తిమి. ఇక్కడిస్తంద్రంటే ఈడికి రావడ్తిమి. ఎక్కడ దొరుకుత లేక పాయె. రైతులు సచ్చుడా..? బతుకుడా..? ఉంటే ఉన్నయని ఇయ్యాలె. లేకుంటే ఎప్పుడస్తయో చెప్పాలె. ఇట్ల గోసవంచుకోవద్దు.

- ఐతం రాజయ్య, వల్లంపహాడ్

విధి నిర్వహణలో మృత్యుఒడికి

- గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి

కారంపూడి శంకర్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 30 : విధి నిర్వహణలో భాగంగా ఆర్టీసీ బస్సులో వెళ్లి రాత్రి అక్కడే నిద్రించిన ఓ కండక్టర్ గుండెపోటుతో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన కారంపూడి శంకర్(57) కరీంనగర్ -2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కరీంనగర్ నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లిన (టీఎస్ 020 బీ 0611) బస్‌కు కండక్టర్‌గా బుధవారం నైట్ హాల్ట్ విధులు నిర్వహించి మండల కేంద్రంలో రాత్రి నిద్రించాడు. రాత్రి 2 గంటల సమయంలో శంకర్‌కు ఛాతిలో నొప్పి రాగా డ్రైవర్ రాకేశ్‌కు విషయం చెప్పాడు. వెంటనే ఆయన, శంకర్‌ను స్థానిక ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాడు. చికిత్స తర్వాత నొప్పి తగ్గిందని లేచి కొద్దిదూరం నడిచిన శంకర్ ఒక్కసారి కుప్పకూలిపోయి అక్కడే ప్రాణాలు విడిచాడు. ఎస్ఐ ఓంకార్‌యాదవ్ ప్రభుత్వ దవాఖానకు చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శంకర్‌కు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆర్టీసీ డీఎం మల్లయ్య, అసిస్టెంట్ డీఎం విజయమ్మ, సెక్యూరిటీ అధికారి లక్ష్మారెడ్డితో పాటు సిబ్బంది కాల్వశ్రీరాంపూర్‌కు చేరుకొని శంకర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

సిరిసిల్లలోని ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చేతబడుల పేరిట మోసం

- రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పోలీసుల దాడులు
- 11 మందిపై కేసులు

రాజన్న సిరిసిల్ల, మే 30 (నమస్తే తెలంగాణ) : మూఢనమ్మకాలు, చేతబడుల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా దాడులు ముమ్మరం చేశారు. తాయెత్తులు, యంత్రాలు, వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకుని, 11 మందిపై కేసులు నమోదు చేసి, 9మందిని ఎమ్మార్వో ముందు బైండోవర్ చేసినట్లు ఎస్పీ అఖిల్ తెలిపారు. బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన జవ్వాజి ధనుంజయ్, రుద్రంగికి చెందిన అంబటి నర్సయ్య, వేములవాడ మండలం చంద్రగిరికి చెందిన బొమ్మెల మల్లేశం, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన జాగిరి పరశురాములు (ఫీర్‌బాబా), గొట్టె రామస్వామి, గొట్టె వెంకటరాములు, గొట్టె శ్రీనివాస్, గొట్టె సురేందర్, గొట్టె శ్రీకాంత్, గొట్టె ప్రవీణ్‌కుమార్, సిరిసిల్లకు చెందిన కడమంచి రామస్వామిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. కోనరావుపేట మండలం గొట్టె రవీందర్, చందుర్తి మండలానికి చెందిన గొట్టె రామకృష్ణ, గొట్టె దయాకర్, మహ్మద్ అజర్ అలీఖాన్, తంగళ్లపల్లికి చెందిన అన్నల్‌దాస్ దశరథం, కంపెల్లి బాలరాజ్, ముస్తాబాద్‌కు చెందిన నడికుల నాగేంద్ర, సిరిసిల్ల బాబాజీ నగర్‌కు చెందిన టేకు నర్సయ్య, కడమంచి దుర్గయ్య, దుర్గస్వామిలను బైండోవర్ చేశారు.

చేతబడులను నమ్మద్దు : ఎస్పీ అఖిల్ మహాజన్

శాస్త్ర సాంకేతిక రంగంలో అడుగిడుతున్న పరిస్థితిలో చేతబడులు, మంత్రాలను నమ్మి మోసపోవద్దు. అనారోగ్యం పాలైన వారు భూత వైద్యులను ఆశయించకుండా దవాఖానల్లో వైద్యులను సంప్రదించాలి. మంత్రాలు, మూఢనమ్మకాల పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. మూఢ నమ్మకాల నిర్మూలనలపై ఇప్పటికే చాలా గ్రామాల్లో పోలీసు శాఖ తరపున, జన విజ్ఞాన వేదిక లాంటి సంస్థల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నం. చేతబడి, మంత్రాలు, మూఢ నమ్మకాల పేరుతో ఎవరినైనా ఇబ్బందులకు గురి చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలె.

వాణిజ్య



నెట్‌ఫ్లిక్స్‌తో వొడాఫోన్ ఐడియా జట్టు

న్యూఢిల్లీ, మే 30: టెలికం సేవల సంస్థ వొడాఫోన్ ఐడియా..వీడియో స్ట్రీమింగ్ సేవల సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో జట్టు కట్టింది. తన కస్టమర్లకు ఎంటర్‌టైన్‌మెంట్ సేవల పరిధిని మరింత విస్తరించడంలో భాగంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రెండు సరికొత్త ప్రీ-పెయిడ్ ప్లాన్లను సైతం ఆవిష్కరించబోతున్నది. యూజర్లు తమకు నచ్చిన మొబైల్, టెలివిజన్ లేదా ట్యాబ్లెట్‌లో ఈ సరికొత్త స్ట్రీమింగ్ సదుపాయం పొందవచ్చునని తెలిపింది. ఇందుకోసం వొడాఫోన్ ఐడియా రెండు ప్రీపెయిడ్ ప్లాన్లను ఆవిష్కరించింది. ఈ ప్లాన్లలో అన్‌లిమిటెడ్ కాల్స్, డాటా పొందవచ్చునని తెలిపింది. దీంట్లో 70 రోజుల కాలపరిమితి కలిగిన రూ.999 ప్లాన్‌లో రోజుకు 1.5 జీబీ డాటాతో పాటు 100 ఎస్ఎంఎస్/రోజుకు, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ చేసుకోవచ్చును. అలాగే 84 రోజుల కాలపరిమితితో విడుదల చేసిన ప్లాన్‌లో రోజుకు 2.5 జీబీ డాటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ వాయిస్, నెట్‌ఫ్లిక్స్ బేసిస్(టీవీ లేదా మొబైల్) పొందవచ్చును. ఈ ప్లాన్ చార్జీ రూ.1,399గా నిర్ణయించింది.

తిండి కోసం దిక్కులు!

- 16 ఏండ్ల కనిష్ఠానికి నిల్వలు
- ఆరేండ్ల తర్వాత దిగుమతులకు గ్రీన్‌సిగ్నల్?
- నిల్వలున్నాయని ఇటీవల కేంద్రం అబద్ధాలు

దిగుమతులు లేనిదే గడవని దుస్థితికి దేశం

అమాంతం పడిపోయిన గోధుమల ఉత్పత్తి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): యావత్తు ప్రపంచ దేశాలకు ఆహారాన్ని ఎగుమతి చేసే స్థాయికి దేశాన్ని తీసుకుపోతామని గప్పాలు కొట్టిన కేంద్రంలోని మోదీ సర్కారు గడిచిన పదేండ్లలో దేశాన్ని ఆకలి భారతంగా మార్చింది. తిండి కోసం విదేశాల వైపు దీనంగా చూసే దుస్థితికి తీసుకొచ్చింది. నిన్న మొన్నటివరకూ ఉల్లి, కందిపప్పు, వంట నూనె, టమాట, చక్కెర వంటి నిత్యావసరాల కోసం దిగుమతులను ఆశ్రయించిన భారత్.. ఇప్పుడు గోధుమల కోసమూ దిక్కులు చూసే దుస్థితికి దిగజారింది. ఆరేండ్ల తర్వాత గోధుమ దిగుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుండటమే దీనికి నిదర్శనం.

నిల్వలు అధఃపాతాళానికి

గోధుమల ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు అదే గోధుమల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన దురవస్థ దాపురించింది. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వెరసి హర్యానా, పంజాబ్, యూపీ, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో గోధుమల దిగుబడి భారీగా తగ్గినట్టు పారిశ్రామికవర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది 112 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర గోధుమ ఉత్పత్తి ఉంటుందని కేంద్రం అంచనా వేసినప్పటికీ, 6.25 శాతం మేర ఉత్పత్తి పడిపోనున్నట్టు తెలుస్తున్నది. ఇదే సమయంలో ఏప్రిల్‌నాటికి గోదాముల్లో నిల్వలు 7.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు క్షీణించాయి. ఇది 16 ఏండ్లలోనే కనిష్ఠం. దీంతో రష్యా వంటి దేశాల నుంచి ఆరేండ్ల తర్వాత గోధుమలు దిగుమతి చేసుకోవాలని కేంద్రం యోచిస్తున్నది. ఈ క్రమంలో గోధుమల దిగుమతులపై ఉన్న 40 శాతం సుంకాన్ని ఎత్తివేయాలనుకొంటున్నది. ఈ మేరకు జూన్‌లో నిర్ణయం ఉండొచ్చని అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' ఓ కథనంలో వెల్లడించింది.

నిల్వలు ఉన్నాయని ఏమార్చి..

దేశీయంగా నిల్వలు తగ్గిపోతుండటంతో 2022లో గోధుమల ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. అయితే, కొరతను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ చర్యలను మాత్రం చేపట్టలేదు. దీంతో గోధుమల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సేకరించే గోధుమల నిల్వలూ పడిపోయాయి. ఇదే విషయమై గత జనవరిలో వివిధ పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయితే, ఎఫ్‌సీఐ వద్ద తగినన్ని నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చెప్పుకొచ్చారు. స్థానిక వ్యాపారులకు 6 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలను కేంద్రం సరఫరా చేసిందని, నిల్వలు లేకుంటే ఇదెలా సాధ్యమని ఉదహరించారు. విదేశాల నుంచి దిగుమతులు దిగుమతి చేసుకొనే అవసరమే లేదని పేర్కొన్నారు.

ఎన్నికల్లో ప్రయోజనం కోసమే..

నిజానికి జనవరి 1నాటికి గోదాముల్లో 16.47 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలు మాత్రమే ఉన్నాయి. ఈ స్థాయిలో నిల్వలు పడిపోతే దేశంలో ఆహార సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉన్నది. దీంతో అప్పుడే గోధుమల దిగుమతులు మొదలు పెట్టాలి. అయితే, విదేశాల నుంచి ఎక్కువ ఖర్చుపెట్టి గోధుమలను దిగుమతి చేసుకొంటే రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవ్వొచ్చని, ఇది ఎన్నికలపై ప్రభావం చూపే ప్రమాదమున్నదని కేంద్రంలోని బీజేపీ సర్కారు భావించిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకనే సరిపడా నిల్వలు ఉన్నట్టు, దిగుమతులు అవసరమే లేదని కేంద్రమంత్రులతో అబద్ధాలు వల్లెవేయించిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కొరతను నివారించడానికి దిగుమతులకు తలుపులు బార్లా తెరువబోతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

అటు రిలయన్స్.. ఇటు టాటా

న్యూఢిల్లీ, మే 30: టైమ్స్ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటిస్తున్న ప్రపంచంలోనే 100 అత్యంత ప్రభావశీల సంస్థల జాబితాలో భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌లు చోటు దక్కించుకున్నాయి. ఈ ఏడాదికిగాను విడుదలైన ఈ లిస్టులో రిలయన్స్, టాటాలు.. టైటాన్ కేటగిరీలో స్థానం పొందాయి. రిలయన్స్‌కు ఈ గౌరవం దక్కడం ఇది రెండోసారి. 2021 జాబితాలోనూ ఉన్నది. కాగా, ఈ సందర్భంగా రిలయన్స్‌ను 'ఇండియా'స్ జాగర్‌నట్'గా టైమ్ అభివర్ణించడం గమనార్హం. అప్రతిహతంగా రిలయన్స్ అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నదని టైమ్స్ ప్రశంసించింది. కరోనా వ్యాక్సిన్‌ను తయారు చేసిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు పయనీర్ కేటగిరీలో చోటు లభించింది. ఈ లిస్టులో 100 కంపెనీలను మొత్తం 5 కేటగిరీల్లో విభజించగా.. లీడర్స్, డిస్రప్టర్స్, ఇన్నోవేటర్స్ విభాగాలూ ఉన్నాయి. ఇది టైమ్స్ నాల్గో జాబితా. ప్రభావం, కొత్తదనం, లక్ష్యం, విజయాల ప్రాతిపదికన ఆయా సంస్థలకు లిస్టులో చోటు దక్కింది.

బ్యాంకింగ్ మోసాలు పెరిగాయ్

గత ఆర్థిక సంవత్సరం 47 శాతం ఎక్కువయ్యాయని ప్రకటించిన ఆర్బీఐ

రూ.78,213 కోట్లకు బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు



ముంబై, మే 30: ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ బ్యాంకింగ్ రంగంలో మోసాలు 46.7 శాతం పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. గురువారం విడుదల చేసిన రిజర్వ్ బ్యాంక్ వార్షిక నివేదిక ప్రకారం నిరుడు ఏప్రిల్ మొదలు ఈ మార్చి చివరిదాకా మొత్తం 36,075 మోసాలు జరిగాయి. అంతకు ముందు ఏడాది కాలంలో 13,564 మోసాలే నమోదయ్యాయి. అయితే ఈసారి ఈ మోసాల విలువ రూ.13,930 కోట్లుగానే ఉన్నది. 2022-23లో మాత్రం రూ.26,127 కోట్లుగా ఉన్నట్టు ఆర్బీఐ గణాంకాలు చెప్తున్నాయి. ఇక ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఎక్కువగా చిన్నపాటి కార్డ్/ఇంటర్నెట్ మోసాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మాత్రం లోన్ పోర్ట్‌ఫోలియోల్లోనే అధికంగా మోసాలకు పాల్పడ్డారు.

రూ.78,213 కోట్లకు..

ఈ మార్చి ఆఖరు నాటికి బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.78,213 కోట్లకు పెరిగినట్టు ఆర్బీఐ తమ తాజా నివేదికలో తెలిపింది. ఏడాది క్రితం రూ.62,225 కోట్లేనన్న ఆర్బీఐ.. గత ఆర్థిక సంవత్సరం 26 శాతం పెరిగినట్టు చెప్పింది. సహకార బ్యాంకులుసహా దేశంలోని అన్ని బ్యాంకుల్లో పదేండ్లు, ఆపై కాలంగా ఖాతాదారులు తమ ఖాతాల నుంచి తీసుకోని డిపాజిట్లే ఇవన్నీ. వీటిని ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తున్నారు. కాగా, సదరు డిపాజిట్ల సెటిల్మెంట్ల కోసం వాటికి చెందిన ఖాతాదారులను లేదా వారి వారసులు, నామినీలను వెతకాలని బ్యాంకులకు ఆర్బీఐ సూచిస్తున్నది. ఇక గత ఆర్థిక సంవత్సరం ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ పరిమాణం 11.08 శాతం పెరిగి రూ.70.47 లక్షల కోట్లకు చేరిందని, అందుకే కేంద్ర ప్రభుత్వానికి మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్లను డివిడెండ్‌గా ప్రకటించామని ఆర్బీఐ తెలిపింది.

ఆర్బీఐ వార్షిక నివేదిక ముఖ్యాంశాలు

- ఈ ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 7 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- గత ఆర్థిక సంవత్సరం రూ.27,000 కోట్ల సావరిన్ గోల్డ్ బాండ్లను కొన్న మదుపరులు.
- రిజర్వ్ బ్యాంక్ వద్ద 822.10 మెట్రిక్ టన్నుల బంగారం.
- ప్రధాన ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చు. ఇదే జరిగితే ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం ఉంటుంది.
- ఈ ఏడాది మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న కరెన్సీలో 86.5 శాతానికి చేరిన రూ.500 నోట్ల వాటా.
- విదేశాల్లో రూపీ అకౌంట్లను తెరిచేందుకు అనుమతి.